సంక్షోభంలో సినిమా థియేటర్లు

ఓటీటీల ప్రభావంతో తగ్గిన ప్రేక్షక ఆదరణ

- భారంగా మారిన సినిమాహాళ్ల నిర్వహణ
- ప్రేక్షకులు ఉంటేనే సినిమాల ప్రదర్శన

ఉదయగిరి: ఒకప్పుడు పట్టణాలతో పాటు పల్లెల్లో సినిమాహాళ్లు సందడికి వేదికలుగా ఉండేవి. సినిమా విడుదల రోజున థియేటర్ల వద్ద అభిమానుల కోలాహలం ఉండేది. అర్ధరాత్రి నుంచే టికెట్ల కోసం క్యూలైన్‌లలో పడిగాపులు పడేవారు. సినిమాహాళ్లు ఈలలు, కేకలతో దద్దరిల్లేవి. ఇదంతా ఒకప్పటి అనుభూతి. ప్రస్తుతం రోజులు మారాయి. వెండితెర వెలుగులు మసకబారుతున్నాయి. ఆధునిక సాంకేతికతో ఓటీటీల రాకతో సినిమాహాళ్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

ప్రేక్షకులు ఉంటేనే 'షో'

గతంలో వింజమూరు మేజర్ పంచాయతీలో మూడు థియేటర్లు ఉండేవి. అంటే వింజమూరుతో పాటు పరిసర ప్రాంత ప్రజలు సినిమాలను ఎంతగా ఆదరించేవారో అర్థం చేసుకోవచ్చు. కానీ నేడు ఓటీటీలు రావడానికి తోడు సినిమాలు ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోతుండడంతో సినిమా థియేటర్లు మూతపడుతున్నాయి. ఇప్పటికే దేవతామహల్‌ను పూర్తిగా నేలమట్టం చేసి లేఅవుట్ వేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారు. అలాగే పాతూరులో ఉన్న లక్ష్మీప్రియ థియేటర్‌ను కూడా సినిమాలకు ఆదరణ తగ్గడంతో మూసివేశారు. ప్రస్తుతం బస్టాండ్ సెంటర్‌లో ఉన్న సూర్య థియేటర్ మాత్రమే నడుస్తోంది. ఈ థియేటర్‌ను సురేష్ ప్రొడక్షన్ వారు పదేళ్ల లీజుకు తీసుకుని నూతన హంగులతో ఏసీ సినిమాహాల్‌గా



మూతపడిన వింజమూరులోని లక్ష్మీప్రియ థియేటర్

మార్చారు. అయినా కొత్త సినిమా వచ్చిన వారం రోజులు మాత్రమే జనం వస్తున్నారు. ఆ తర్వాత జనం రావడం లేదని, కనీసం పదిహేను మంది ఉంటేనే సినిమా వేస్తున్నట్లుగా నిర్వాహకులు చెబుతున్నారు. నెలలో కనీసం సగం రోజులు కూడా 'షో'లు పడకపోతుండడంతో నిర్వహణ భారంగా మారిందని వారు చెబుతున్నారు. ఈ పరిస్థితి ఒక్క వింజమూరులోనే కాదు కావలి, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం వంటి పట్టణాలతో పాటు నెల్లూరు నగరంలో కూడా నెలకొని ఉంది.

ఓటీటీల రాకతో..

టీవీల రాకతో థియేటర్లకు కొంత వరకు ఆదరణ తగ్గింది. ప్రస్తుతం ఓటీటీల రాకతో థియేటర్లకు వచ్చి సినిమా చేసే సంస్కృతి పూర్తిగా తగ్గిపోయిందని సినిమాహాళ్ల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు వంద రోజుల పాటు సినిమాలు ఆడేవని, ప్రస్తుతం కనీసం వారం రోజుల పాటు కూడా ప్రదర్శించే పరిస్థితి లేదని వాపోతున్నారు. సినిమాలు విడుదలైన రెండు, మూడు వారాల్లోనే ఓటీటీల్లోకి వచ్చేస్తుండంతో సినిమా ప్రియులు మొబైల్స్, టీవీల్లో ఇంట్లోనే



వింజమూరులో పాక్షికంగా ప్రదర్శనలు వేస్తున్న సూర్య శిరీషా థియేటర్

వీక్షిస్తున్నారు. కాస్త ఆర్థిక స్తోమత ఉన్న వారు ఇళ్లలో హోమ్‌థియేటర్లను ఏర్పాటు చేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి వీక్షిస్తున్నారు. ఈ సంస్కృతి సినిమా హాళ్ల భవిష్యత్తు, మనుగడపై తీవ్ర ప్రభావం చూపనుంది.

సవాల్‌గా నిర్వహణ భారం

సినిమా హాళ్ల నిర్వహణ వాటి యజమానులకు ఒక పెద్ద సవాల్‌గా మారింది. సినిమా వేసినా..వేయకపోయినా నెలకు కనీసం ఆయా ప్రాంతాలను బట్టి రూ.లక్ష నుంచి రూ.2.5 లక్షల వరకు ఖర్చు అవుతోంది. ఇందులో కరెంటు చార్జీలు నెలకు రూ.50వేల వరకు వస్తున్నాయి. మిగిలిన నిర్వహణ ఖర్చులు సరేసరి. సినిమా ఆడితే విద్యుత్ బిల్లులు మరింత పెరుగుతాయి. కనీసం 15 మంది ఉంటే సినిమా ఆడిస్తారు. ఈ విధంగా నెలలో ఎక్కువ షోలు వేయాల్సి వస్తుండడంతో ఆర్థిక భారం మరింత పెరుగుతున్నట్లుగా నిర్వాహకులు వాపోతున్నారు. దీనికితోడు సినిమా పంపిణీదారులు అమలు చేస్తున్న రెంటల్ విధానంతో మరింతగా నష్టపోతున్నామని సినిమాహాళ్ల యజమానులు వాపోతున్నారు. పర్సెంటేజీ విధానం కొంతమేర మేలు చేకూరుస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ విధానం అమలు కోసం డిమాండ్ చేయగా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ థియేటర్లపై వసతులు, నిబంధనల పేరుతో దాడులు చేయించి పరోక్షంగా హెచ్చరికలు జారీ చేయడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భవిష్యత్ తరాలకు జ్ఞాపకంగా..

భవిష్యత్‌లో సినిమా హాళ్లు కళ్యాణ మండపాలుగా మారే అవకాశం కనిపిస్తోంది. పట్టణాల్లో కల్యాణ మండపాలకు గిరాకీ ఉండడంతో ఆ దిశగా యజమానులు ఆలోచన చేస్తున్నట్లుగా చెబుతున్నారు. కొన్ని సినిమా హాళ్లకు విశాలమైన పార్కింగ్ స్థలం ఉండడం పరివర్తనకు అనుకూలంగా ఉంది. ఏది ఏమైనా సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులు అనేక రంగాలపై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో భవిష్యత్తు తరాలకు సినిమాహాళ్లు ఒక పాత జ్ఞాపకంగా మారబోతున్నాయి.

యువతపోరు జయప్రదానికి పిలుపు

కావలి (జలదంకి): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నెల్లూరులో సోమవారం తలపెట్టిన యువతపోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదా నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేసిందని తెలిపారు. భవిష్యత్‌ను అంధకారం చేసిన కూటమి సర్కార్ తీరును నిరసిస్తూ యువత పోరు కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. యువతకు మద్దతుగా నెల్లూరులోని పాత జెడ్పీ కార్యాలయం కూడలి నుంచి కలెక్టరేట్ వరకు చేపడుతున్న నిరసన ర్యాలీలో పార్టీ నాయకులు కార్యకర్తలు, యువత పెద్దఎత్తున పాల్గొని కూటమి ప్రభుత్వ మోసాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

వరికుంటపాడు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నెల్లూరులో సోమవారం తలపెట్టిన యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మందలపు తిరుపతి నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని లేదా నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేసిందన్నారు. యువతకు మద్దతుగా నెల్లూరులోని పాత జెడ్పీ కార్యాలయం కూడలి నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు వివరించారు. మండలంలోని పార్టీ నాయకులు కార్యకర్తలు, యువత పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

క్లుప్తంగా

అంకాలమ్మకు పొంగళ్లు



దుత్తలూరు: నర్రవాడ పంచాయతీ మజరా వడ్డిపాళెంలో గ్రామదేవత అంకాలమ్మకు పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మేకపాటి వంశీయుల ఆధ్వర్యంలో భక్తులు పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. తొలుత అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేషాలంకరణ, పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఉచిత వైద్యశిబిరం



మర్రిపాడు: డీసీపల్లిలోని మాల్యాద్రి ఆర్‌ఎంపీ క్లినిక్‌లో ఆత్మకూరుకు చెందిన డాక్టర్ బీఎస్సార్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రముఖ పీడియాట్రిక్ వైద్యనిపుణురాలు డాక్టర్ సిరాజ్‌ఖానం 60 మంది చిన్నారులకు వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఎస్సార్ ఆస్పత్రిలో చిన్నారులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన పలువురు బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం పంపిణీ చేశారు. పెరుమాళ్లపాడులోని ఫామ్‌హౌస్‌లో టీడీపీ నాయకుల చేతుల మీదుగా 32 మందికి రూ.31.50లక్షల నగదు చెక్కులను అందజేశారు. అనంతరం ఆత్మకూరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై నాయకులు, కార్యకర్తలు, పార్టీ పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. ఎన్‌డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, శాంతకుమారి, తాళ్లూరి గిరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చేతిబోర్ల నిర్వహణపై నిర్లక్ష్యం



సీతారామపురం : మండలంలో చేతిబోర్ల నిర్వహణ అధ్వానంగా తయారైంది. చేతిబోర్ల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహించడంతో పలు గ్రామాల్లో అవి నిరుపయోగంగా మారాయి. గతంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు లక్షలాది రూపాయలు వెచ్చించి చేతిపంపులను ఏర్పాటు చేశారు. కాలక్రమేణా వాటి నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో అవి మరమ్మతులకు గురై నిరుపయోగంగా మారాయి. చేతిబోర్ల మరమ్మతులకు ప్రత్యేకంగా సిబ్బంది ఉన్నప్పటికీ అధికారులు వాటి నిర్వహణపై దృష్టి సారించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి మరమ్మతులకు గురైన చేతిబోర్లపై ప్రత్యేక దృష్టి సారించి వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన సీతారాముల ఉత్సవాలు



పొంగళ్ల సామగ్రిని బుట్టల్లో పెట్టుకుని వెళ్తున్న భక్తులు

ఉదయగిరి రూరల్: మండలంలోని సున్నంవారిచింతలలో శుక్రవారం నుంచి జరుగుతున్న సీతారాముల ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరిరోజు ఉదయం ఉట్టి మహోత్సవం, వసంతోత్సవాలను నిర్వహించారు. మధ్యాహ్నం పార్వేట ఉత్సవాన్ని జరిపారు. మహిళలు సామూహికంగా పొంగళ్ల సామగ్రిని కొత్త బుట్టల్లో పెట్టుకుని సీతారాములతో కలిసి గ్రామసమీపంలోని వనంతోపునకు వెళ్లి పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాలకు వలసవాసులు గ్రామానికి చేరుకోవడంతో గ్రామంలో సందడివాతావరణం నెలకొంది.

నిరుపయోగంగా వాటర్‌ప్లాంట్లు



నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్

సీతారామపురం : మండలంలోని నెమళ్లదిన్నె, సీతారామపురం, బోడసిద్ధాయపల్లి తదితర గ్రామాల్లో సుజల స్రవంతి మినీవాటర్ ప్లాంట్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఆయా గ్రామాల్లోని ప్రజలకు శుద్ధి చేసిన నీటిని 20 లీటర్లను రూ.5కే అందించే లక్ష్యంతో సుజలస్రవంతి పథకం కింద వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఆ తరువాత వాటిలో మంచినీటిని నింపకపోవడంతో ప్రజలు ప్రైవేట్‌గా కొనుగోలు చేసి తాగుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి వాటర్‌ప్లాంట్లను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

మానవ హక్కులపై అవగాహన

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని టిడ్కో గృహాల వద్ద మానవ హక్కుల కమిటీ అధ్యక్షుడు కే స్టీఫెన్ ఆధ్వర్యంలో మానవహక్కులపై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఆత్మకూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం రాములు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు మానవ హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత మానవహక్కుల కమిటీలపై ఉందన్నారు. అనంతరం స్టీఫెన్ మానవ హక్కులపై అవగాహన కల్పించారు. జిల్లా అధ్యక్షుడు పాల్, కార్యదర్శి



అజయ్, ఉదయగిరి కమిటీ అధ్యక్షురాలు సౌమ్య, ఆత్మకూరు, ఉదయగిరి కమిటీ సభ్యులు పొదిలి పుల్లయ్య, రిజ్వాన, ఝాన్సీ, లీలావతి, శిరీషా, నరసమ్మ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సంయుక్త సేవా సంస్థ సేవలు ప్రశంసనీయం

కావలి (జలదంకి): సంయుక్త సేవా సంస్థ ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ నిరుపేదలు, విద్యార్థులకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలికి చెందిన సంయుక్త సేవా సంస్థ పదో వార్షికోత్సవం, సంయుక్త నృత్య కళానిలయం రెండో వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీనివాస కల్యాణ మండపంలో జరిగిన ఈ వేడుకలకు ఎంపీ, ఎమ్మెల్యేలు ముఖ్యఅతిథులుగా హాజరై చిన్నారుల నృత్య ప్రదర్శనలను తిలకించారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్నారులు చదువుతో పాటు సంప్రదాయ నృత్యాలను నేర్చుకుని నాట్యమయూరిలుగా



నృత్య ప్రదర్శనలు చేస్తున్న చిన్నారులు

పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. సంయుక్త సేవా సంస్థ అధ్యక్షుడు సురేంద్ర చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సినీనటుడు వాసుదేవ్, నృత్య కళానిలయం నాట్య గురువు లిఖిత, సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఆశాకార్యకర్త పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

జలదంకి: గట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చింతలపాళెంలో ఆశాకార్యకర్తగా పనిచేయుటకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లుగా గట్టుపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ షేక్ షాయిస్తా అఫ్రీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతలపాళెనికి చెందిన పదోతరగతి ఉత్తీర్ణులైన 25 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు కలిగిన మహిళలు అర్హులని చెప్పారు. గట్టుపల్లి పీహెచ్‌సీలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయ ని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దమ్ముంటే పట్టుకోండి

అల్లూరులో దొంగల హల్‌చల్

- ఎవరూ లేని ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు
- 40 రోజుల్లో ఎనిమిది ఘటనలు
- భారీగా సొత్తు, నగదు అపహరణ
- వరుస చోరీలతో హడలిపోతున్న ప్రజలు

అల్లూరు: నగర పంచాయతీ పరిధిలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. ఎవరూ లేని ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. పగలు రెక్కీ నిర్వహించి రాత్రి వేళల్లో తమ చేతివాటాన్ని చూపుతున్నారు. ఇళ్లలోని విలువైన సొత్తు, నగదును దోచుకెళ్తున్నారు. ఇలా 40 రోజుల వ్యవధిలో ఎనిమి ది చోట్ల దొంగతనాలకు పాల్పడి దమ్ముంటే పట్టుకోండి అంటూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

40రోజుల్లో 8 చోరీలు

➡ అల్లూరు నగర పంచాయతీ పరిధిలో 40 రోజుల వ్యవధిలో దొంగలు 8 చోరీలకు పాల్పడ్డారు. భారీగా నగదు, సొత్తును దోచుకెళ్లారు. మే 20న తూర్పువీధిలోని నాంచరయ్య ఇంట్లో చోరీకి పాల్పడిన దొంగలు ఏడు వందల గ్రాముల వెండివస్తువులును దోచుకెళ్లారు.

➡ మే 27వ తేదీ పెయ్యలవారీ వీధిలోని బేల్దారి రఫి ఇంట్లో దొంగలు పడి ఐదు సవర్ల బంగారం, రూ.90 వేల నగదును అపహరించారు. అదేరోజు అల్లూరుపేట శివాలయం వీధిలోని సాయిబాబా మందిరంలో చోరీకి యత్నించారు. తలుపులు రాకపోవడంతో వెనుదిరిగారు. అదేరోజు బలిజపాళెంలోని పెంచలయ్య ఇంట్లోకి చొరబడి బీరువాను పగులగొట్టారు. ఏమీ దొరకకపోవడంతో వెళ్లిపోయారు.

➡ మే29న అల్లూరు హరిజనవాడలోని వీ బ్రహ్మయ్య ఇంట్లోకి చొరబడి ఏడు సవర్ల బంగారం , లక్ష రూపాయల నగదును అపహరించారు.

➡ జూన్ 19న అంజినాయుడుకాలనీకి చెందిన కే మహేష్ కుటుంబంతో కలిసి దైవదర్శనానికి తిరుమలకు వెళ్లగా దొంగలు ఇంట్లోకి చొరబడి 10 సవర్ల బంగారం, రూ.70 వేల నగదును దోచుకెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటి పక్కన ఉండే వారు తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి మహేష్‌కు ఫోన్ ద్వారా తెలియజేయగా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా అదే ప్రాంతానికి చెందిన కోడూరు ఉమాదేవి సైతం తన తల్లిని చూసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఊరికి వెళ్లారు. ఆదివారం ఇంటికి తిరిగి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలోని 13 సవర్ల బంగారం కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం రోజే రెండిళ్లలో దొంగలు చోరీకి పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఒకేరోజు 23 సవర్ల బంగారాన్ని దోచుకెళ్లడంతో నగర పంచాయతీ ప్రజలు హడలిపోతున్నారు. వరుసగా చోరీలు జరుగుతున్నా పోలీసులు కేసులను ఛేదించలేకపోవడం, చోరీలను కట్టడి చేయలేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు స్పందించి రాత్రి వేళల్లో గస్తీని పెంచి చోరీలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.



ఈ నెల 19న మహేష్ ఇంట్లో బీరువా లాకర్‌ను తెరిచిన దృశ్యం



గత నెలలో రఫీ ఇంట్లో బీరువాను తెరిచి దుస్తులను చిందరవందరగా పడేసిన దృశ్యం

శరవేగంగా మండల పరిషత్ కార్యాలయ పునర్నిర్మాణ పనులు



ఉదయగిరి : మండల పరిషత్ కార్యాలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మండల పరిషత్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎంపీపీ మూలే పద్మజారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని తన పదవి కాలంలో పునర్నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంకల్పించారు. ఎంపీపీ, జిల్లా పరిషత్ నిధులు ఉపయోగించి పనులు ప్రారంభించారు. భవనాన్ని మరింత ఆధునికంగా నిర్మించుకునేందుకు కలెక్టర్ ద్వారా ప్రభుత్వం నుంచి ప్రత్యేక గ్రాంట్‌ను మంజూరు చేయించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను సైతం ఎంపీపీ కోరారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రూ.29 లక్షలకు తోడు అదనంగా మరో రూ.25 లక్షల మంజూరు కోసం ప్రయత్నం చేస్తున్నారు. మరో మూడు నెలల్లో భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలనే సంకల్పంతో శరవేగంగా పనులు చేపడుతున్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు



రామస్వామిపల్లిలో పొంగళ్లు పెడుతున్న భక్తులు

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లిలో గ్రామదేవత పోలేరమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళా భక్తులు సామూహికంగా పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా పోలేరమ్మ ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. వర్షాలు సకాలంలో కురిసి పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు.

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిలలోని హిల్‌కాలనీలో పోలేరమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మహిళలు సామూహికంగా పోలేరమ్మ చెట్టు వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు.

నేత్రపర్వంగా కల్యాణ మహోత్సవం



సంగం: మండలంలోని తరుణవాయిలోని కోదండ రామస్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా తూర్పువీధి యువత ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని శనివారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి సంప్రదాయబద్ధంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా మర్రి వేణు, సుష్మ దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పీలం సురేష్‌బాబు, మర్రి సందీప్, డేగా శ్రావణ్, డేగా అశోక్, మర్రి వంశీ, పసుపులేటి వినయ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ గ్రామోత్సవం



సంగం: మండలంలోని మర్రిపాడు గ్రామంలో గంగమ్మ గ్రామోత్సవాన్ని శనివారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. గంగమ్మ ఉత్సవమూర్తిని ట్రాక్టర్‌పై కొలువుదీర్చి పూలతో విశేషంగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.